క్లుప్తంగా

గ్రంథాలయాలతో విజ్ఞానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ మౌలాలి

మిడుతూరు: పతిరోజు క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం అలవర్చుకోవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చని ఎంఈఓ మౌలాలి అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ పరిమళ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరానికి ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో యువకులకు పోటీ పరీక్షలకు కావలసిన పుస్తకాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వేసవి శిబిరంలో వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, బహుమతులు అందజేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలి

ఆత్మకూరు: రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని ఆత్మకూరు ఒప్పంద అధ్యాపక సంఘం అధ్యక్షుడు అబ్దుల్ జబ్బార్ కోరారు. పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల వద్ద శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2009 నుంచి 1,800 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నామని, 12 సంవత్సరాలుగా విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమను రెగ్యులర్ అధ్యాపకులుగా నియమించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు సరస్వతి, కవిత, సుధాకర్, భవనేశ్వరి, కల్పన తదితరులు పాల్గొన్నారు

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఈఓపీఆర్డీ



సుబ్రహ్మణ్యశర్మ

జూపాడుబంగ్లా: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా శనివారం ఈఓపీఆర్డీ సుబ్రహ్మణ్యశర్మ బాధ్యతలు స్వీకరించారు. జూపాడుబంగ్లా ఈఓపీఆర్డీ మణిమంజరి పదోన్నతిపై ఎంపీడీఓగా మంత్రాలయం వెళ్లారు. ఇక్కడి ఎంపీడీఓ మంజులవాణి డిప్యూటేషన్ పై జిల్లా పంచాయతీరాజ్‌శాఖ అధికారిణిగా వెళ్లారు. దీంతో జూపాడుబంగ్లా ఈఓపీఆర్డీ, ఎంపీడీఓ స్థానాలు ఖాళీ అయ్యాయి. నందికొట్కూరు ఈఓపీఆర్డీగా ఉన్న సుబ్రహ్మణ్యశర్మ జూపాడుబంగ్లాకు బదిలీ చేశారు. ఆయనకు ఖాళీగా ఉన్న ఇన్‌చార్జి ఎంపీడీఓ బాధ్యలను అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

పండ్లతోటల పెంపకాన్ని అలవాటు చేసుకోవాలి

కొత్తపల్లి: మండలంలోని చిన్న, సన్నకారు రైతులు పండ్లతోటల పెంపకాన్ని అలవాటు చేసుకోవాలని ఏపీఓ షేక్ రేష్మ సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామసచివాలయంలో సర్పంచు నక్క విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందికి, రైతులకు పండ్లతోటల సాగుపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సాధారణ సాగుతో నష్టాల బారిన పడకుండా ఉండేందుకు రైతులు పండ్ల తోటలను సాగు చేసుకోవాలని సూచించారు. తోటల్లో అంతర పంటలను కూడా సాగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి వినోద్, ఫీల్డ్ అసిస్టెంట్ సంపత్‌కుమార్, ఉపసర్పంచు బొల్లు శ్రీనివాసులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాధవరం సర్పంచ్‌కు ఎమ్మెల్యే శిల్పా పరామర్శ

వెలుగోడు: మాధవరం గ్రామ సర్పంచ్ బ్రహ్మనందరెడ్డిని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పరామర్శించారు. బ్రహ్మనందరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాధవరం గ్రామానికి చేరుకొని ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. రెస్టు తీసుకోవాలని సూచించారు. అలాగే మోతుకూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు సుధాకర్‌రెడ్డి గృహ ప్రవేశానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి దేశం తిరుపెంరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్ నాయుడు, ముంతల విజయభాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ బన్నూరు జనాభా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మసీదుల సమస్యల పరిష్కారానికి కృషి

నందికొట్కూరు: మసీదులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉమ్మడి ముస్లిం మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ అబుబక్కర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మసీదులను పరిశీలించారు. హజ్ యాత్ర కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగనన్న మసీదులను అన్ని రకాలుగా తీర్చిదిద్దేందుకు ముందడుగు వేశారన్నారు. మసీదులకు కాంపౌండ్ వాల్, మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రహం, రహిమాన్, మసీదు పెద్దలు మహబూబ్‌బాషా, సలాంమియ్యా, ఖలీల్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ఇండోర్ స్టేడియాలు సిద్ధం

- రూ. 2.38 కోట్లతో నందికొట్కూరు, పగిడ్యాల మండలాల్లో నిర్మాణం
- శరవేగంగా పూర్తయిన పనులు
- ఈ నెల 15 లేదా 18న ప్రారంభించే అవకాశం



ప్రారంభోత్సవానికి ముస్తాబైన పగిడ్యాల ఇండోర్ స్టేడియం

పగిడ్యాల: నియోజకవర్గంలోని నందికొట్కూరు, పగిడ్యాల మండలాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో రూపుదిద్దుకున్న ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి ముస్తాబయ్యాయి. రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కోరిక మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు ఇండోర్ స్టేడియాలకు రూ. 2.38 కోట్లు మంజూరు చేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. గతేడాది డిసెంబర్ నెలలో మంజూరైన స్టేడియాల నిర్మాణ పనులను నంద్యాల వీఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ చేపట్టి శరవేగంగా పూర్తి చేసింది. దీంతో క్రీడాకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

నాలుగు టెన్నిస్ కోర్టులు..

నందికొట్కూరు పట్టణంలో, పగిడ్యాలలోని ఆదర్శ పాఠశాల మైదానంలో చేపట్టిన ఇండోర్ స్టేడియంల నిర్మాణాలు శరవేగంగా పూర్తయ్యాయి. ఒక్కో స్టేడియంలో నాలుగు అధునాతన టెన్నిస్ కోర్టులను ఏర్పాటు చేశారు. క్రీడాకారులకు కావాల్సిన సదుపాయాలు అన్నీ కల్పించారు. మొదట ఈ నెల 9 తేదీన ప్రారంభిస్తారనే ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. ప్రారంభోత్సవం చేసేందుకు రాష్ట్ర క్రీడల, సాంస్కృతిక, పర్యాటక శాఖ మాత్యులు ఆర్‌కే రోజా వస్తారనే ప్రచారం నియోజకవర్గంలో జోరుగా సాగింది. అయితే ఆ గడువు అనివార్య కారణాల వల్ల వాయిదా పడడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. అత్యంత ఆకర్షణీయంగా తయారు చేసిన టెన్నిస్ కోర్టులు క్రీడాకారుల రాక కోసం ఎదురు చూస్తున్నాయి. మళ్లీ మంత్రి ఆర్‌కే రోజా ఈ నెల 15 లేదా 18వ తేదీన వస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

పనులు పూర్తి అయ్యాయి

నందికొట్కూరు నియోజకవర్గంలోని పగిడ్యాల, నందికొట్కూరు మండలాలలకు ఇండోర్ స్టేడియాలను గతేడాది డిసెంబర్ నెలలో నిధులు మంజూరు చేసింది. ఒక్కొక్క స్టేడియం కోసం రూ. 1.19 కోట్లు విడుదల చేసింది. ఈ పనులను నంద్యాల వీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. పనులన్నీ పూర్తి చేశాం. ఈనెల 9న మంత్రి ఆర్‌కే రోజా చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు చేయాల్సి ఉంది. అయితే సాధ్యపడలేదు. మళ్లీ ఈనెల 15వ తేది లేదా 18వ తేదిన ప్రారంభోత్సవ వేడుకలు ఉండే అవకాశం ఉంది.

– స్వామిరెడ్డి, పర్యవేక్షక ఏఈ

11న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మిడుతూరు: ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులకు 11వ తేదీ ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సలీంబాషా శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లను apms.apc-fss.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

పాములపాడు: గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ గోపికృష్ణను సర్పంచు వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి కోరారు. శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ తుమ్మలూరు గ్రామ పంచాయతీలో ఏ సమస్య తలెత్తిన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీఓ తెలిపారు. జేఈ రాఘవేంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య తదితరులు ఉన్నారు.

నీటి ముంపు రైతులకు న్యాయం చేస్తాం



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

కొత్తపల్లి: శ్రీశైలం జలాశయం నిర్మాణంలో భూములు కోల్పోయిన నీటిముంపు రైతులకు న్యాయం చేస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున అన్నారు. శుక్రవారం మండలంలోని కొక్కెరంచ గ్రామంలో నీటిముంపు రైతులతో గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జలాశయం నిర్మాణంలో కొక్కెరంచ గ్రామంలో సుమారు 331 మంది రైతులు భూములను కోల్పోయారన్నారు. గతంలో నష్టపరిహారం కొంత మందికి అందకపోవడంతో కోర్టును ఆశ్రయించారన్నారు. ప్రభుత్వం వారి సమస్యను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కారం చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. అదేవిధంగా మండలంలోని ఎర్రమఠం, సంగమేశ్వరం, భట్టువారిపల్లె, ఎదురుపాడు, గ్రామాలలో త్వరలో గ్రామసభలు ఏర్పాటు చేసి రైతుల నుంచి అర్జీలను స్వీకరించి సమస్య పరిష్కారం అయ్యేల చూస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచు విష్ణువర్ధన్ రెడ్డి, పీఓఎల్ఆర్ డీటీ పెద్దన్న, ఆర్ఐ జహంగీర్ బాషా పాల్గొన్నారు.

పెద్దారుట్ల గూడేన్ని తరలించండి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రకాశం జిల్లా, పెద్దదోర్నాల మండలంలోని పెద్దారుట్ల చెంచుగిరిజన గూడేన్ని పుల్లలచెరువు మండలం వెంకటాద్రిపాలెంకు తరలించాలని కోరుతూ కొమరంభీం ఆదివాసి చెంచు గిరిజన సంఘం నాయకులు వై.ఆశీర్వాదం, వెంకటేశ్వర్లు శుక్రవారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కనీససౌకర్యాలకు దూరంగా పెద్దారుట్ల గూడెంలో 20 కుటుంబాలకు పైగా చెంచుగిరిజనులు నివసిస్తున్నారని తెలిపారు. అక్కడి గిరిజనులు జనవరి నెలలో ప్రకాశం జిల్లా కలెక్టర్‌కు స్పందనలో అర్జీ సమర్పించినట్లు పీఓకు తెలిపారు. పుల్లలచెరువు మండలం వెంకటాద్రిపాలెంలో రెవెన్యూ స్థలం పక్కన అటవీ బంజరు భూమి ఉందని, అక్కడికి ఈ గ్రామాన్ని తరలించి గిరిజనులకు ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు, నిర్మించి ఇవ్వాలన్నారు. వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు 5ఎకరాల వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలని కోరారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న డీఏఓ టి. మోహన్‌రావు

పగిడ్యాల: రైతులు తప్పనిసరిగా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) టి. మోహన్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఏఓ మాట్లాడుతూ రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు ఎక్కువగా పిచికారీ చేయరాదన్నారు. భూసార పరీక్షలకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు సిఫారసు చేసిన ఎరువులను చల్లుకోవాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు అబ్దుల్లా, వెంకటేష్, ఎంపీఈఓ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి సన్మానం



ఎంపీపీని సన్మానిస్తున్న దృశ్యం

నందికొట్కూరు రూరల్ : మండలంలోని రైతులు పంటలు సాగు చేసే సమయంలో మండల వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలని మండల ఎంపీపీ మురళీ క్రిష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆత్మభవన్‌లో రైతులు, వ్యవసాయ శాఖ అధికారులతో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు ఎంపీపీని సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఏ విజయశేఖర్, ఏఓ షేక్షావలి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పబ్బతి రవి పాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగుల అంతర్గత బదిలీలు

మహానంది: మహానంది దేవస్థానంలోని ఆలయాలు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల విధుల్లో మార్పులు చేస్తూ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మహానంది దేవస్థానంలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ మేరకు పలు కీలకస్థానాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల స్థానాలను మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. కాణిపాకం నుంచి వచ్చిన సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబుకు విధులు అప్పగించాల్సి ఉంది. సుమారు ఇరవై మందికి పైగా ఉద్యోగుల స్థానాలు మార్పులు చేశారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు

మహానంది: గ్రామాల్లో అందరూ శాంతియుత వాతావరణంలో ఉండాలని, ఎవరైనా గొడవలు సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని బండిఆత్మకూరు ఎస్ఐ బాబు హెచ్చరించారు. బండిఆత్మకూరు మండలం అయ్యవారి కోడూరు గ్రామంలో శుక్రవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. అలాగే మహానంది ఎస్ఐ జి.నాగేంద్ర ప్రసాద్ కోరారు. తమ్మడపల్లె, సూర్యనంది ముఖ ద్వారం వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

మిడుతూరు: నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ పీరునాయక్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాన్ని ఏఓ తనిఖీ చేశారు.

ప్రగతి సాధించకపోతే మెమోలు

మహానంది: ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో ప్రగతి సాధించకపోతే మెమోలు తప్పవని బండిఆత్మకూరు ఎంపీడీఓ వాసుదేవగుప్త హెచ్చరించారు. బండిఆత్మకూరు మండలం నారాయణాపురం, లింగాపురం గ్రామాల్లో శుక్రవారం సచివాలయాలను తనిఖీ చేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



అరటితోటలను పరిశీలిస్తున్న శిల్పా భువనేశ్వర్ రెడ్డి, అధికారులు

మహానంది: ఈదురు గాలులకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని శ్రీశైలం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఈదురుగాలులకు నేలవాలిన అరటితోటలను జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజుతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శిల్పా భువనేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వెంటనే స్పందించి, నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేలా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పూర్తిస్థాయి నివేదికలు రూపొందించాలని ఆదేశించారని చెప్పారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రాథమిక 900 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందన్నారు. ఉద్యానశాఖ అధికారులు, సిబ్బంది పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలను నమోదు చేయాలన్నారు. నష్టపోయిన ప్రతిరైతుకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శరభారెడ్డి, మండల నాయకులు వీరారెడ్డి, కుంచపు శ్రీనివాసులు, కందుల రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అరటితోటల పరిశీలనకు ఎమ్మెల్యే

ఈదురుగాలులకు నేలకొరిగిన అరటితోటలను పరిశీలించేందుకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వరరెడ్డి తెలిపారు. బుక్కాపురం, జమాలయ్యదర్గా, గోపవరం, గాజులపల్లె ఆర్ఎస్ తదితర గ్రామాల పరిధిలో అరటితోటలను సందర్శించి రైతులతో మాట్లాడతారన్నారు.

ఎకరాకు రూ.లక్ష ఇవ్వాలి

ఈదురుగాలులకు నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాలకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. శుక్రవారం మండల పరిధిలో నష్టపోయిన అరటితోటలను పరిశీలించారు.

నాలుగేళ్లలో ఆరు లక్షల ఉద్యోగాలు

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే ధ్యేయం
- ఆత్మకూరు మెగా జాబ్‌మేళా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

ఆత్మకూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగేళ్లలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరు లక్షల ఉద్యోగాలు కల్పించారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నిరుద్యోగి ఉద్యోగం పొంది కుటుంబ సభ్యులకు ఆర్థికంగా సహాయ పడేలా ఎదగాలన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 3 సార్లు మెగా జాబ్‌మేళాను నిర్వహించామని, ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలువురు నిరుద్యో గులు జాబ్ మేళాను ఏర్పాటు చేయాలని తనను కోరానని, వారి విజ్ఞప్తి మేరకు జాబ్‌మేళాను నిర్వహించానన్నారు. 1500 మంది నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, 13 రకాల కంపెనీలు ఇక్కడకు వచ్చాయని చెప్పారు. యువతీ యువకులందరూ తమ క్వాలిఫికేషన్‌ను బట్టి నచ్చిన ఉద్యోగాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. రూ.12 వేల నుంచి రూ.72వేల వరకు జీతాలు పొందగలరని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆసియా మారుఫ్, ఎంపీపీ తిరుపాలమ్మ, నిర్వాహకులు శ్రీధర్‌రెడ్డి, పురుషోత్తం, కరెస్పాండెంట్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షుడు సయ్యద్ మీర్, రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూ శ్మశానవాటిక ఏర్పాటు

గత ఎన్నికల్లో హిందువులకిచ్చిన మాటకు కట్టుబడి ఉన్నానని, మాట ఇచ్చిన విధంగా హిందువులకు నూతన శ్మశాన వాటికను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో శుక్రవారం హిందూ శ్మశాన వాటికకు కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైల జగద్గురు పీఠాధిపతి హిందువులకు 4 ఎకరాల భూమిని ధారాదత్తం చేశారని, ఇందుకు తాను శ్రీశైలంలో జగద్గురు పీఠానికి 10 ఎకరాల భూమిని కేటాయించానని చెప్పారు. దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకరించారిని తెలిపారు. ఆ 10 ఎకరాల్లో 100 పడకల ఆసుపత్రి, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే క్రైస్తవులకు శ్మశానవాటిక ఏర్పాటుకు, ముస్లింలకు ఇప్పటికే శ్మశావాటికకు వెళ్లేందుకు రహదారులు నిర్మాణం చేపట్టామన్నారు.

స్పోర్ట్స్

క్రీడలపై ఆసక్తి ఉండాలి

ఆత్మకూరు: చిన్నప్పటి నుంచే చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, కౌన్సిలర్ విజయ్ చౌదరి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం క్రికెట్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీ దేవానంద్, సీనియర్ క్రీడాకారులు రఫి, రాఘవ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: యువత క్రీడల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం దుద్యాల గ్రామంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలను అందుకోవాలన్నారు. క్రీడలతో మానసిక ఆరోగ్యం, శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్, ఆర్గనైజర్లు జాకీర్, కలాం, సురేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్య



మృతిచెందిన హిరణ్‌కుమార్

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో హిరణ్ కుమార్(22) అనే యువకుడు శుక్రవారం తెల్లవారు జామున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కుటుంబీకులతో కలిసి ఇంటిమిద్దెపై పడుకున్నాడు. రాత్రి 2 గంటల సమయంలో ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. 2.30 గంటల సమయంలో మృతుడి తమ్ముడు జితేంద్ర గమనించి గట్టిగ కేకలు వేశాడు. కుటుంబసభ్యులు కిందికి దించి చూసేలోపు మృతి చెందాడు. గత రెండేళ్లుగా తన కుమారుడు కడుపు నొప్పితో బాధపడుతున్నాడని, అందుకే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని మృతుడి తల్లి పుష్పావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

బైకులు ఢీ.. వ్యక్తికి గాయాలు

ఆత్మకూరు : శ్రీపతిరావుపేట రస్తా వద్ద శుక్రవారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్. అమలాపురం గ్రామానికి చెందిన భాస్కర్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం బైక్‌పై వస్తుండగా ఘటనా స్థలానికి చేరగానే ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. భాస్కర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతని కాలు విరిగడంతో స్థానికులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అమృత్ సరోవర్‌తో రైతులకు బహుళ ప్రయోజనం



చెరువు గట్టువద్ద మొక్క నాటిస్తున్న స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ నారాయణరెడ్డి, సిబ్బంది

జూపాడుబంగ్లా: అమృత్ సరోవర్ పథకంతో రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని సీఆర్‌డీ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని తంగడంచ చెరువులో జరుగుతున్న అమృత్‌సరోవర్ పథకం పనులను పరిశీలించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ చెరువులో పూడికతీత పనుల వల్ల ఏమైనా ప్రయోజనాలున్నాయా అంటూ ఆరాతీశారు. చెరువులో ఉపాధి కూలీలు తవ్విన పూడికమట్టిని రైతులు వారి సొంత ట్రాక్టర్లతో మట్టిని పొలాలకు తీసుకెళ్లవచ్చునన్నారు. తద్వారా పొలంలో భూసాంద్రత పెరిగి పంటల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. చెరువులో పూడికను తొలగించటం వల్ల నీటినిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు సమీపంలోని పొలాల్లోని బోర్లు, బావుల్లో నీటిమట్టం పెరుగుతుందన్నారు. అనంతరం బ్లాక్ ప్లాంటేషన్ కింద చెరువు గట్టువెంట మొక్కలు నాటించాలని ఏపీడీ అన్వరాబేగం, ఏపీఓ గౌరీబాయిలను ఆదేశించారు. చెరువు గట్టు వద్ద మొక్కలను నాటించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరరెడ్డి, ఏపీడీ కృష్ణమోహన్, ఈసీ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

మల్లన్న సేవలో అడిషనల్ డీజీ



మల్లన్నను దర్శించుకున్న అనంతరం ఆలయం వద్ద డీజీ దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు రవిశంకర్ అయ్యనార్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శుక్రవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన డీజీకి ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వారికి ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించి సత్కరించారు. వీరి వెంట సీఐ దివాకర్‌రెడ్డి, టూటౌన్ ఎస్ఐ గంగయ్యయాదవ్ ఉన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో శుక్రవారం అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్ర పారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మహానందీశ్వరుడికి పల్లకోత్సవం

మహానంది: శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకులు శరభయ్యశర్మ తదితరులు స్వామి,అమ్మవార్లను స్థానిక అలంకార మండపంలో కొలువు చేసి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, అలంకార హారతులిచ్చారు. అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవం కనుల పండుగగా చేపట్టారు.

మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ



మహానంది: బుక్కాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన మారెమ్మ ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా జరిగాయి. శ్రీ మారెమ్మ, పోతురాజు, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి(నాగ దేవతలు) విగ్రహాలను ప్రతిష్ఠించారు. పండితులు, అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవాచనం, విగ్రహారాధన, అమ్మవారికి పంచామృతాభిషేకం, నాగదేవతలకు పాలాభిషేకం, తదితర పూజలు చేపట్టారు. మారెమ్మ విగ్రహాన్ని దాతలు సుబ్బారెడ్డి దంపతులు అందివ్వగా, నాగదేవతల విగ్రహాలను దమాల చిన్న పుల్లయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు దమాల నాగచంద్రబాబు అందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వైస్ కుంచపు లక్ష్మీనరసమ్మ, సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఓంకారంలో పెళ్లి సందడి

మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారం క్షేత్రంలో శుక్రవారం పెళ్లిసందడి నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన నూతన వధూవరులు ఆలయ ప్రాంగణంలో వేదమంత్రాల సాక్షిగా ఒక్కటయ్యారు. వివాహం అనంతరం వధూవరులు, వారి బంధుమిత్రులు ఆలయానికి చేరుకుని శ్రీ ఓంకార సిద్దేశ్వరస్వామిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

శ్రీసుంకులాపరమేశ్వరికి సిద్ధార్థరెడ్డి పూజలు



అమ్మవారిని దర్శించుకున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీసుంకులాపరమేశ్వరీ అమ్మవారిని శుక్రవారం రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి దర్శించుకున్నారు. సర్పంచ్ నాగార్జునరెడ్డి ఆయనకు స్వాగతం పలుకగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీలు జగదీశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, పర్వతనేని యుగంధర్‌రెడ్డి, పుల్యాల దివ్య, వైస్ ఎంపీపీలు కృష్ణారెడ్డి, మురళీకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.